
సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం : 22 : మార్చి : 2024



మెడికోలకు బెదిరింపులు !

ప్రిన్సిపాల్‌కు వ్యతిరేకంగా ఆందోళన చేస్తే ఎంబీబీఎస్ ఎలా పాస్ అవుతారో చూస్తామని విద్యార్థులను కొందరు బెదిరించారు. 8లో



సీసీఐ విక్రయాలకు తెర

పత్తికి ప్రైవేటు వ్యాపారులు అధిక ధర చెల్లిస్తుండడంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాలకు తెర పడింది. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
36° / 22°

జిల్లాలో శుక్రవారం ఉదయం నుంచే ఎండ ప్రభావం మొదలై మధ్యాహ్నానికి పెరుగుతుంది. రాత్రి వాతావరణం కొంత చల్లబడుతుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శుక్రవారం సా॥) 6.26

సహర్ (శనివారం ఉ॥) 4.49

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే 'తెల్లం'



సీఎం రేవంత్‌తో ఎమ్మెల్యే వెంకట్రావు

భద్రాచలం: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు గురువారం హైదరాబాద్‌లో కలిసి శాలువాతో సత్కరించారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరనున్నారని ప్రచారం సాగుతున్న నేపథ్యంలో వెంకట్రావు సీఎంను కలవడం చర్చనీయాంశంగా మారింది.

అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యలు పరిష్కరిస్తాం

జిల్లా సంక్షేమాధికారి వేల్పుల విజేత



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ విజేత

అశ్వారావుపేట: అంగన్‌వాడీ కేంద్రాల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా సంక్షేమాధికారి వేల్పుల విజేత అన్నారు. మండల పరిధి లోని జమ్మిగూడెం సెక్టార్ కేశప్పగూడెంలో నిర్వహించిన పోషణ్ పక్వాడ్ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. గర్భిణులకు సీమంతం, తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు అందేలా మిల్లెట్ ఫుడ్ గురించి అవగాహన కల్పించారు. అనంతరం విజేత మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యుత్, ఫ్యాన్, లైటు, మరుగుదొడ్ల ఏర్పాటు తదితర సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఏడీఏ అఫ్జల్‌బేగం, సీడీపీఓ రోజారాణి, సూపర్‌వైజర్ వరలక్ష్మి, పద్మ, విజయలక్ష్మి, స్వరాజ్యం తదితరులు పాల్గొన్నారు.

సాఫీగా వైద్య, ఆరోగ్య కార్యక్రమాలు

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లాలో వైద్య, ఆరోగ్య కార్యక్రమాలు సాఫీగా సాగేలా ఉద్యోగులు చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలని రాష్ట్ర ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు(డీహెచ్) రవీందర్ నాయక్ ఆదేశించారు. ఖమ్మం జిల్లాలో గురువారం పర్యటించిన ఆయన డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ప్రోగ్రాం అధికారులతో సమీక్షించారు. ప్రోగ్రాం అధికారులు కార్యక్రమాల అమలులో నిబద్ధతతో వ్యవహరిస్తేనే ప్రజలకు అవసరమైన వైద్య సేవలు అందుతాయని తెలిపారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు అమలులో అధికారులు చొరవ చూపుతూ వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసి జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానానికి చేర్చాలని చెప్పారు. అలాగే, ప్రైవేట్ ఆస్పత్రుల్లో సిజేరియన్లు తగ్గించి సాధారణ ప్రసవాలను పెంచేలా పర్యవేక్షించాలని సూచించారు.


కారు.. మారని గేరు!

ఎన్నికల కోడ్ కూసినా గులాబీ దళం కారు గేరు మార్చడం లేదు. అభ్యర్థులను ప్రకటించి దాదాపు నాలుగు వారాలు గడిచిప్పటికీ ఇంకా క్షేత్రస్థాయి ప్రచార కార్యక్రమాల్లో ఎలాంటి ఊపూ రాలేదు. అభ్యర్థి ఎంపిక విషయంలో కమలం నేతలు సైతం మల్లగుల్లాలు పడుతుండగా మరోవైపు కాంగ్రెస్ పార్టీ ప్రచారంలో దూసుకుపోతోంది.

–సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

అమల్లోకి వచ్చిన పార్లమెంట్ ఎన్నికల కోడ్

- రెండు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన బీఆర్‌ఎస్
- నాలుగు వారాలైనా గులాబీ దళంలో కనిపించని జోష్
- 'మహబూబాబాద్'లో ప్రచారం ప్రారంభించిన కాంగ్రెస్
- ఖమ్మం అభ్యర్థి ఎంపికపై ఆచితూచి వ్యవహరిస్తున్న బీజేపీ



సిట్టింగులకే చాన్స్

జిల్లాలో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఇందులో కొత్తగూడెం, అశ్వారావుపేట నియోజకవర్గాలు ఖమ్మం పార్లమెంట్ పరిధిలో ఉండగా భద్రాచలం, ఇల్లెందు, పినపాక నియోజకవర్గాలు మహబూబాబాద్ లోక్‌సభ పరిధిలోకి వస్తాయి. గత పదేళ్లుగా అధికారంలో ఉండి ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చెందిన బీఆర్‌ఎస్.. ఖమ్మం, మహబూబాబాద్ స్థానాల్లో సిట్టింగ్ ఎంపీలు నామా నాగేశ్వరరావు, మాలోత్ కవితనే తిరిగి బరిలోకి దింపుతామని ప్రకటించింది. అయితే నాలుగు వారాలు గడుస్తున్నా ఇంతవరకు జిల్లాలో ఎక్కడా కారు పార్టీలో ఆశించిన స్థాయిలో కదలిక లేదు.

మొక్కుబడిగా ఒకే ఒక్కటి..

గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఖాతాలో పడిన భద్రాచలం నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, ఎంపీ మాలోత్ కవిత ఇటీవల నిర్వహించారు. సిట్టింగ్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ఇప్పటికే కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించడంతో ఈ సమావేశాన్ని నియోజకవర్గ కేంద్రమైన భద్రాచలంలో కాకుండా చర్లలో ఏర్పాటుచేశారు. వాజేడు, వెంకటాపురం, చర్ల, దుమ్ముగూడెం మండలాల నుంచి మొక్కుబడిగా కొందరు నాయకులు హాజరుకాగా, భద్రాచలం మండలం నుంచి అంతంత మాత్రంగానే వచ్చారు. ఇల్లెందు, పినపాక నియోజకవర్గస్థాయి సమావేశాలు ఇంకా ఖరారు కాలేదు. ఆఖరికి ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్సీ కవిత అరెస్టు సందర్భంగా చేసిన ఆందోళనలు సైతం తూతూమంత్రంగానే జరిగాయనే భావన బీఆర్‌ఎస్ శ్రేణుల్లో నెలకొంది. ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు వ్యక్తిగత పనుల కారణంగా ఎన్నికల క్షేత్రానికి దూరంగా ఉంటున్నారు.

జోరుమీదున్న నాయక్..

మహబూబాబాద్ పార్లమెంట్ నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున తన అభ్యర్థిత్వం ఖరారైన మరుక్షణమే పోరిక బలరాంనాయక్ యాక్టివేట్ అయ్యారు. ఈనెల 11న భద్రాచలం సభలో హుషారుగా కనిపించారు. అదే రోజు సాయంత్రం మణుగూరులో నిర్వహించిన భారీ బహిరంగ సభలో సీఎం రేవంత్‌తో పాటు ఐదుగురు మంత్రులు పాల్గొని బలరాంనాయక్‌ను గెలిపించాలని కోరారు. ఆ తర్వాత ఇల్లెందులో నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని ఎమ్మెల్యే కోరం కనకయ్య నిర్వహించారు. దీంతో జిల్లాలో ఉన్న మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొదటి దఫా ప్రచారాన్ని బలరాంనాయక్ పూర్తి చేసినట్టయింది. ఖమ్మం అభ్యర్థి ప్రకటన రాకపోవడంతో కొత్తగూడెం, అశ్వారావుపేటలలో హస్తం పార్టీ నేతలు వేచి చూసే ధోరణి అవలంబిస్తున్నారు.

బీజేపీలో పెరుగుతున్న పోటీ..

రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తమకు హ్యాట్రిక్ విజయం ఖాయమనే నమ్మకం బీజేపీ శ్రేణుల్లో కనిపిస్తోంది. దీంతో కమలం గుర్తుపై పోటీ చేసేందుకు తీవ్రమైన పోటీ నెలకొంది. పాత నేతల్లో ఆసక్తి ఉన్న వారు టికెట్ కోసం ప్రయత్నిస్తుండగా ఈసారి కొత్తగా భద్రాద్రి జిల్లాకు చెందిన తాండ్ర వినోద్‌రావు పేరు తెరపైకి వచ్చింది. అనూహ్యంగా మాజీ ఎమ్మెల్యే జలగం వెంకటరావు సైతం బీజేపీలో చేరి టికెట్ రేసులోకి వచ్చారు. పోటీ పెరగడంతో ఖమ్మం అభ్యర్థి ఎంపికలో కమలం పార్టీ పెద్దలు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ఇక మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా సీతారాం నాయక్ పేరు ప్రకటించినా ప్రచారం ప్రారంభించలేదు. రెండు స్థానాలకు అభ్యర్థుల పేర్లు ఖరారైన తర్వాత జాతీయ స్థాయి నేతలు ప్రచార రంగంలోకి దిగుతారని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. పైగా ఎన్నికల కోడ్ అమల్లోకి రాకముందే ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్‌సాయ్‌తో భద్రాచలంలో ఆ పార్టీ ఒకమారు బహిరంగ సభ నిర్వహించింది.

సమీకృతమే మార్గం





భద్రాచలం ఫారెస్ట్ కార్యాలయంలో నిర్వహిస్తున్న నర్సరీ (ఇన్‌సెట్) నిరుపయోగంగా ఉన్న ఫారెస్ట్ కాంప్లెక్స్

- రాష్ట్ర విభజనతో భద్రాచలానికి అన్యాయం
- పట్టణం మినహా అంతా ఏపీ పరిధిలోనే
- భద్రాచలాన్ని వేధిస్తున్న స్థల సమస్య
- ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకేచోట నిర్మిస్తే బెస్ట్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం : ప్రభుత్వం భారీ ఎత్తున నిధులు మంజూరు చేస్తే వాటిని పూర్తి స్థాయిలో ఖర్చు చేసేందుకు గల అవకాశాలు భద్రాచలంలో తక్కువగా ఉన్నాయి. భక్తులకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు, పట్టణంలో నూతన అభివృద్ధి పనులు చేసేందుకు సరిపడా స్థలం అందుబాటులో లేదు. ఈ సమస్యను అధిగమించేందుకు కొత్త తరహా వ్యూహాలను అమలు చేయాల్సిన అవసరం ఉంది.

ప్రభుత్వ కార్యాలయాలెన్నో..

భద్రాచలంలో నెలకొన్న స్థల లేమి సమస్యకు సరైన పరిష్కారం అందుబాటులో ఉన్న స్థలాలను సమర్థంగా ఉపయోగించుకోవడమే. నిజాం కాలం నుంచే భద్రాచలం పట్టణం పరిపాలన కేంద్రంగా ఉంది. జిల్లాల విభజనకు ముందే ఇక్కడ సబ్ కలెక్టర్, అడిషనల్ ఎస్పీ, కోర్టులు, సబ్‌జైలు ఉన్నాయి. ఆ తర్వాత పాల్వంచలో ఉన్న ఐటీడీఏ కేంద్రాన్ని భద్రాచలానికి తరలించారు. ఏజెన్సీలోని అడవుల పర్యవేక్షణ కోసం అటవీశాఖకు సైతం భద్రాచలంలో అనేక కార్యాలయాలు, సిబ్బందికి క్వార్టర్లు ఉన్నాయి. ఇవన్నీ వందకు పైగా ఎకరాల్లో విస్తరించి ఉన్నాయి. చర్ల రోడ్డులో జూనియర్ కాలేజీ గ్రౌండ్, ఐటీడీఏ భవనాలు ఉండగా.. ఆలయం రోడ్డులో ఫైర్ స్టేషన్ నుంచి తహసీల్దార్ ఆఫీస్ వరకు సుమారు 600 మీటర్ల పొడవులో వివిధ ప్రభుత్వ కార్యాలయాలు విస్తరించి ఉన్నాయి.

ఐడీఓసీ తరహాలో..

జిల్లాల పునర్విభజన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో వేర్వేరు చోట్ల విస్తరించి ఉన్న ప్రభుత్వ కార్యాలయాలను ఒకే చోట ఉండేలా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(ఐడీఓసీ) నిర్మించారు. దీంతో ప్రభుత్వ పరమైన సేవలు ప్రజలకు ఒకేచోట అందుబాటులోకి వచ్చాయి. భద్రాచలంలో కూడా ఇలాంటి తరహాలోనే ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకేచోట నిర్మిస్తే స్థల సమస్యను కొంతమేర పరిష్కరించుకోవచ్చు. దీంతో కొత్తగా 100 ఎకరాల స్థలం అందుబాటులోకి రావడంతో పాటు ప్రజలకు కూడా ప్రభుత్వ సేవలన్నీ ఒకేచోట అందే అవకాశం ఉంటుంది. ఈ స్థలాల్లో ప్రస్తుత, భవిష్యత్ అవసరాలకు తగ్గట్టు కొత్త నిర్మాణాలు చేపట్టొచ్చు.

రైల్వేలైన్ వచ్చినా..

భద్రాచలం పట్టణం మధ్యలో ఉన్న సబ్‌జైలు, ఆర్టీసీ బస్ డిపో వంటి వాటిని ఇతర ప్రాంతాలకు తరలించడం ద్వారా మరింత స్థలం అందుబాటులోకి వస్తుంది. వరంగల్ నగర నడిబొడ్డున ఉన్న సబ్‌జైలును సిటీ వెలుపలికి మార్చి, ఆ స్థలంలో ప్రస్తుతం 22 అంతస్తులతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మిస్తున్నారు. భద్రాచలంలో కూడా ఆర్టీసీ డిపోను గోదావరి నదికి అవతలి వైపు సారపాక సమీపంలో ఏర్పాటు చేస్తే మరింత స్థలం లభించే అవకాశం ఉంటుంది. భవిష్యత్‌లో పాండురంగాపురం – భద్రాచలం – మల్కన్‌గిరి రైల్వేలైన్ నిర్మాణం జరగనుంది. సరైన స్థలం లేకుంటే రైల్వే స్టేషన్ సైతం ఊరికి దూరంగా ఎక్కడో నిర్మించాల్సి వస్తుంది. ఈ క్రమంలో స్థల లభ్యత సమస్యపై సరైన నిర్ణయం తీసుకోకుంటే అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసినా అవి నిరుపయోగమే అవుతాయని పలువురు వాపోతున్నారు.

పోలవరం ముంపు పేరుతో..

రాష్ట్ర విభజనలో భద్రాచలానికి తీరని అన్యాయం జరిగింది. పోలవరం ముంపు పేరుతో కూనవరం, వరరామచంద్రాపురం, చింతూరు మండలాలతో పాటు భద్రాచలం మండలంలో పట్టణం మినహా మిగిలిన గ్రామాలన్నీ ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేశారు. దీంతో ప్రస్తుతం పట్టణంలోనే 15 శాతం భూభాగం ఏపీ పరిధిలో ఉంది. రామాలయానికి చెందిన భూములన్నీ కూడా ఏపీ పరిధిలోనే ఉన్నాయి. ఫలితంగా భద్రాచలంలో స్థల సమస్య ఎదురైంది. ఇటు ప్రభుత్వ, అటు ప్రైవేటు పరంగా ఏమైనా కొత్త నిర్మాణాలు చేపట్టాలన్నా, ఆలయం తరఫున భక్తుల కోసం ఏమైనా సౌకర్యాలు కల్పించాలన్నా స్థలం లభించడం లేదు. చివరకు గోదావరి ముంపు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం సైతం ఇబ్బందిగానే మారింది.

అక్రమ మద్యం, నగదు సరఫరాకు చెక్

ఎస్పీ రోహిత్‌రాజ్

కొత్తగూడెంటౌన్ : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు జిల్లా వ్యాప్తంగా పటిష్ట భద్రత చర్యలు చేపడుతున్నట్టు ఎస్పీ రోహిత్‌రాజ్ తెలిపారు. జిల్లాతో సరిహద్దు కలిగి ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతితో పాటు అక్కడి పోలీసు అధికారులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున జిల్లాల సరిహద్దులో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టుల వద్ద అధికారులు సమన్వయం పాటించాలని సూచించారు. అక్రమ మద్యం, నగదు సరఫరా నిరోధానికి 12 అంతర్రాష్ట్ర చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చెక్ పోస్టుల వద్ద విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, 24 గంటలూ వాహనాలు తనిఖీ చేయాలని అన్నారు. సరైన అధారాలు లేకుండా నగదు, మద్యం తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో పాల్వంచ, జంగారెడ్డిగూడెం, పోలవరం డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



వీసీలో మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజ్

అడవుల పరిరక్షణలో వెనుకాడేది లేదు

కలెక్టర్ ప్రియాంక ఆల

పాల్వంచరూరల్ : రాష్ట్రంలో అత్యధిక విస్తీర్ణం గల ఈ జిల్లాలో ప్రతి ఒక్కరూ అడవులను కాపాడాలని, అందుకోసం ఎంతటి సాయం అందించడానికైనా వెనుకాడేది లేదని కలెక్టర్ ప్రియాంక ఆల అన్నారు. మండలంలోని కిన్నెరసాని డీర్ పార్కు వద్ద గురువారం వైల్డ్‌లైఫ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ అటవీ దినోత్సవానికి ఆమె హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అడవి బాగుంటేనే అందరమూ బాగుంటామనే విషయాన్ని గుర్తించాలన్నారు. అడవుల్లో చెట్లు నరికినా, జంతువులను వేటాడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అడవుల సంరక్షణ విషయంలో అటవీ శాఖకు సహాయ సహకారాలు అందించేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని ప్రకటించారు. ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ.. అటవీ శాఖ, ఐటీడీఏ శాఖలు కలిసి సమన్వయంతో పనిచేస్తామన్నారు. అటవీ పరిరక్షణ కోసం సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్పీ రోహిత్ రాజ్, డీఎఫ్‌ఓ కృష్ణగౌడ్, ఎఫ్‌డీఓలు కట్టా దామోదర్ రెడ్డి, బి.బాబు, రేంజర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



కిన్నెరసానిలో సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

పనులు వేగవంతం చేయండి..

కిన్నెరసానిలోని పర్యాటక, అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ప్రియాంక ఆల అధికారులను ఆదేశించారు. కిన్నెరసానిలో పర్యటించిన ఆమె.. రిజర్వాయర్‌లో ఆనంద ద్వీపాన్ని, నిర్మాణంలో ఉన్న అద్దాలమేడ, కాటేజీలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పర్యాటక, అభివృద్ధి పనులు ఎందుకు ఆలస్యమవుతున్నాయని, నిధుల కొరత ఉందా అని అడిగి తెలుసుకున్నారు. పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు.

పరీక్ష కేంద్రంలో కలెక్టర్ తనిఖీ

పాల్వంచ : పాల్వంచ కేటీపీఎస్ కాలనీలోని డీఏవీ మోడల్ స్కూల్‌లో నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్షను కలెక్టర్ ప్రియాంక ఆల గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులకు సౌకర్యాల కల్పనలో నిర్లక్ష్యం చేయొద్దని అధికారులకు సూచించారు. మాస్ కాపీయింగ్ జరగకుండా చూడాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఇన్విజిలేటర్లు విధులు నిర్వహించాలన్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్‌ఫోన్‌లు అనుమతించొద్దని స్పష్టం చేశారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను పటిష్టంగా అమలు చేయాలని, ప్రతీ ఒక్కరిని క్షుణ్ణంగా పరిశీలించాకే లోనికి అనుమతించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ మధు, మున్సిపల్ కమిషనర్ ఎ.స్వామి, తహసీల్దార్ వివేక్ తదితరులు ఉన్నారు.

మూడో రోజు 63 మంది గైర్హాజరు

కొత్తగూడెంఅర్బన్: పదో తరగతి పరీక్షల్లో మూడో రోజైన గురువారం జిల్లాలో మొత్తం 63 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఈఓ ఎం. వెంకటేశ్వరాచారి ఒక ప్రకటనలో తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులు 12,337 మందికి గాను 12,284 మంది హాజరయ్యారని, 53 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. ఇక ప్రైవేటు విద్యార్థులు 45 మందిలో 35 మంది హాజరు కాగా, 10 మంది గైర్హాజరయ్యారని, ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని తెలిపారు.



పరీక్ష తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల

భర్తీ కథ కంచికేనా ?

- భద్రాచలం ఏరియా ఆస్పత్రిని వేధిస్తున్న సిబ్బంది కొరత
- పోస్టులు భర్తీ చేస్తామని రెండు రోజులు హడావిడి
- ఆ తర్వాత ఎవరూ పట్టించుకోని వైనం
- సిబ్బంది లేమి సాకుతో ఇతర ఆస్పత్రులకు రిఫర్



భద్రాచలం ఏరియా ఆస్పత్రి

భద్రాచలం: భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో నర్సింగ్ సిబ్బంది భర్తీ ప్రక్రియ అతీగతీ లేకుండా పోయింది. ఈ ఆస్పత్రిలో పని చేస్తున్న పలువురు సిబ్బంది 317 జీఓతో బదిలీపై వెళ్లగా పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందక పేదలు పడుతున్న కష్టాలపై 'సాక్షి' నెల క్రితం వరుస కథనాలు ప్రచురించింది. దీంతో స్పందించిన కలెక్టర్, జిల్లా వైద్యాధికారులు రెండురోజుల పాటు సమీక్ష సమావేశాల పేరుతో హడావిడి చేశారు. కాంట్రాక్ట్ ప్రాతిపదికన లేదా డిప్యూటేషన్‌పై వెంటనే పోస్టులు భర్తీ చేస్తామని చెప్పినా కార్యరూపం దాల్చలేదు. దీంతో సిబ్బంది కొరత కథ ఇక కంచికేనా అనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వసతులున్నా.. సేవలు అంతంతే

భద్రాచలం ఆస్పత్రిలో మొత్తం 33 మంది నర్సింగ్ సిబ్బంది ఉండేవారు. అయితే జీఓ 317 అమలుతో అందులో 17 మంది బదిలీపై ఇతర జిల్లాలకు వెళ్లగా ప్రస్తుతం 16 మంది మాత్రమే ఉన్నారు. దీంతో బాధితులకు సరైన వైద్య సేవలు అందడం లేదు. ఈ విషయమై ప్రచురితమైన వరుస కథనాలతో సమస్య పరిష్కరించాలని కలెక్టర్ ప్రియాంక ఆల వైద్యశాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. పోస్టులు భర్తీ చేస్తామని వారు వివరణ ఇచ్చినా నేటికీ నర్సింగ్ సిబ్బందిని నియమించలేదు. దీంతో 200 పడకలు ఉన్న ఈ ఆస్పత్రిలో పూర్తి స్థాయిలో వైద్యం అందని పరిస్థితి నెలకొంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల నుంచి పేదలు ఎంతో మంది వైద్య సేవల కోసం ఇక్కడికి వస్తుంటారు. అత్యాధునిక వైద్య పరికరాలు, అన్ని విభాగాలతో కూడిన వార్డులు, 200 పడకలతో పక్కా భవనం ఉన్నా.. సరిపడా సిబ్బంది లేక సరైన సేవలు అందడం లేదు. స్థానిక ప్రజాప్రతినిధులు సైతం దీనిపై వినతిపత్రాల సమర్పణకే పరిమితమయ్యారు తప్ప సమస్య పరిష్కరించలేకపోయారనే ఆరోపణలు వస్తున్నాయి.

రిఫరల్ కేసుల హవా..

ఏరియా ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బందిని పూర్తి స్థాయిలో నియమించకపోవడంతో రిఫరల్ కేసుల హవా నడుస్తోంది. ఉదాహరణకు ప్రసూతి విభాగంలో ఒక్కరే వైద్యురాలు ఉండడంతో ఆస్పత్రికి వచ్చే వారందరికీ ప్రసవాలు చేయలేకపోతున్నారు. సర్జికల్ తదితర విభాగాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. దీంతో పెద్ద సంఖ్యలో వచ్చిన కేసులను వివిధ కారణాలతో ఇతర ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారు. జిల్లా కేంద్ర ఆస్పత్రికి పంపిస్తున్నామని వైద్యాధికారులు చెబుతున్నా.. అత్యధిక కేసులు 'ప్రైవేట్'కే వెళ్తున్నాయి. దీంతో సుదూర ప్రాంతాల నుంచి వైద్యం కోసం వచ్చిన పేదలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో బిల్లులు చెల్లించేందుకు అప్పు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు.

కలెక్టర్, పీఓ దృష్టి సారించాలి



ఏరియా ఆస్పత్రిలో నర్సింగ్ సిబ్బందిని భర్తీ చేయడంలో జిల్లా వైద్యాధికారులు నెల రోజులుగా అలసత్వం వహిస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు మేలుచేసేలా ప్రత్యేక కార్యాచరణ ఉండాలి. యుద్ధప్రాతిపదికన ఖాళీలను భర్తీ చేసేలా కలెక్టర్, ఐటీడీఏ పీఓ ప్రత్యేక దృష్టి సారించాలి. లేదంటే గిరిజన సంఘాల ఆధ్వర్యంలో నిరసనలకు కార్యాచరణ ప్రకటిస్తాం.

– ముర్ల రమేష్, ఆదివాసీ కొండరెడ్ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు

డిప్యుటేషన్ జాబితా సిద్ధం చేస్తున్నాం



జీఓ 317తో భద్రాచలం ఏరియా ఆస్పత్రి నుంచి అత్యధికంగా నర్సింగ్ సిబ్బంది బదిలీపై వెళ్లిన మాట వాస్తవమే. ఈ పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేసే అవకాశం ఉంది. అయితే ఎన్నికల కోడ్‌తో ఆలస్యమయ్యే అవకాశం ఉండడంతో డిప్యుటేషన్ జాబితా సిద్ధం చేస్తున్నాం. సిబ్బంది అంగీకారంతో కూడిన జాబితాను కలెక్టర్‌కు అందజేసి రెండు రోజుల్లో ఈ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నాం.

– రవిబాబు నాయక్, డీసీహెచ్‌ఎస్

క్లుప్తంగా

అడవుల రక్షణను బాధ్యతగా భావించాలి

డీఎఫ్‌ఓ కిష్టాగౌడ్



5కే రన్‌లో అటవీశాఖ అధికారులు


ఇల్లెందురూరల్: అడవుల రక్షణను ఉద్యోగులందరూ బాధ్యతగా భావించాలని జిల్లా అటవీశాఖ అధికారి కిష్టాగౌడ్ పేర్కొన్నారు. ప్రపంచ అటవీ దినోత్సవాన్ని మండలంలోని సుభాష్‌నగర్ నేచర్ పార్క్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. సిబ్బందితో కలసి మొక్కలు నాటారు. 5కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధులు నిర్లక్ష్యం వహిస్తే వేటు తప్పదని అన్నారు. మొక్కలు నరికినట్లు, అక్రమంగా తరలించినట్లు సమాచారం వస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీఓ కర్నావత్ వెంకన్న, ఇన్‌చార్జి రేంజ్ అధికారి ప్రసాద్, డీఆర్‌ఓలు సాల్మన్‌రాజ్, రాంసింగ్, సుక్కి, సీతారామారావు, బాలాజీ, సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

అద్దె ఇల్లు కావాలంటూ సైబర్ నేరం

అశ్వారావుపేటరూరల్: ఇల్లు అద్దె పేరుతో ఓ ప్రైవేటు ఉద్యోగి బ్యాంకు ఖాతా నుంచి సైబర్ నేరగాడు నగదు స్వాహా చేసిన ఘటనపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ శ్రీరాముల శ్రీను కథనం ప్రకారం.. అశ్వారావుపేటకు చెందిన ప్రైవేట్ ఉద్యోగి శ్రీనివాసరావుకు ఏపీలోని విజయవాడలో సొంత ఇల్లు ఉంది. ఇల్లు అద్దెకు ఇస్తానని కొద్ది రోజుల క్రితమే ఓఎల్‌ఎక్స్‌లో వివరాలు ఉంచాడు. దీంతో ఓ సైబర్ నేరగాడు తాను కేంద్ర ప్రభుత్వ ఉద్యోగినని, ఇల్లు అద్దెకు కావాలని ఫోన్‌చేశాడు. గూగుల్ పే ద్వారా అద్దె నగదు అడ్వాన్స్‌గా పంపిస్తానని నమ్మించా డు. కాగా తన ఖాతా నుంచి డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేసేందుకు గూగుల్ పే యాప్‌ను ఓపెన్ చేసి తాను చెప్పిన వివరాలు నమోదు చేయాలని చెప్పాడు. ఆ వ్యక్తి చెప్పిన వివరాలను యాప్‌లో నమోదు చేయగానే శ్రీనివాసరావు బ్యాంకు ఖాతాలో ఉన్న నగదు రెండు విడతల్లో రూ.38 వేలు డ్రా చే సినట్లు మెసేజ్ వచ్చింది. వెంటనే సదరు వ్యక్తి నంబరుకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రావడంతో మోసపోయినట్లు గ్రహించిన శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సైబర్ నేరం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పదిన్నరైనా తెరుచుకోని పాఠశాల

- ఇద్దరు టీచర్లలో ఒకరికి మెడికల్ లీవ్
- మరొకరికి పదో తరగతి ఇన్విజిలేషన్ విధులు



మొక్కంపాడుతండా ప్రాథమిక పాఠశాల

టేకులపల్లి: మండలంలోని మొక్కంపాడు పంచాయతీ పరిధి మొక్కంపాడుతండా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల గురువారం ఉదయం పదిన్నర గంటలు దాటినా తెరుచుకోలేదు. ఒంటిపూట బడులు కావడంతో ఉదయం 8 గంటలకే పాఠశాల తెరవాల్సి ఉంది. ఇక్కడ ఇద్దరు ఉపాధ్యాయులు పనిచేస్తుండగా హెచ్‌ఎం సురేష్ నాలుగైదు రోజులుగా మెడికల్ లీవ్‌లో ఉన్నారు. మరో టీచర్ సుజాతకు పదో తరగతి పరీక్షల ఇన్విజిలేషన్ విధులు కేటాయించారు. దీంతో గురువారం ఉదయం పదిన్నర గంటల తర్వాత బోడు కాంప్లెక్స్ సీఆర్‌పీ చందర్ వచ్చి పాఠశాల తెరిచారు. అప్పటిదాకా విద్యార్థులు మాస్టర్ల కోసం ఎదురుచూస్తూ కూర్చొన్నారు. ఈ విషయమై కాంప్లెక్స్ హెచ్‌ఎం జగన్‌ను వివరణ కోరగా..ప్రత్యామ్నాయ టీచర్‌ని పంపించాల్సి ఉందని, పని ఒత్తిడి వల్ల మరిచిపోయాయనని, సీఆర్‌పీని పంపించానని తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీకి యత్నం

సుజాతనగర్: తాళం వేసిన ఓ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి యత్నించారు. సుజాతనగర్‌లోని నందనవనం వెంచర్‌లో నివాసముంటున్న గుంటి శ్రీనివాస్ పది రోజుల క్రితం ఊరు వెళ్లాడు. ఈ క్రమంలో తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించిన దొంగలు బీరువాను సైతం పగులగొట్టారు. అయితే, వారికి బంగారం, డబ్బు లభించకపోవడంతో సామగ్రిని చిందరవందర చేసి వెళ్లిపోయారు. గురువారం ఉదయం తలుపులు తీసి ఉండడాన్ని గమనించిన స్థానికులు శ్రీనివాస్‌కు సమాచారం ఇవ్వగా ఆయన చేరుకుని పోలీసులకు తెలిపారు. కొత్తగూడెం నుంచి క్లూస్‌టీంను పిలిపించిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,045

ఎంబీబీఎస్ ఎలా పాసవుతారో చూస్తాం

- ఆందోళన విరమించకపోతే ప్రాక్టికల్, ఇంటర్నల్ మార్కులు కట్
- ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులకు హెచ్‌ఓడీల బెదిరింపులు!



ప్రభుత్వ వైద్య కళాశాల ఎదుట ధర్నా చేస్తున్న మెడికోలు (ఫైల్)

కొత్తగూడెంరూరల్ : 'మీ భవిష్యత్ మా చేతుల్లో ఉంది. మీరు ఎలా ఎంబీబీఎస్ పాస్ అవుతారో చూస్తాం. ప్రిన్సిపాల్‌ను, మమ్మల్ని తక్కువ అంచనా వేస్తున్నారు. ప్రాక్టికల్, ఇంటర్నల్ మార్కులు, హాజరు శాతం అంతా మా చేతుల్లోనే. ప్రిన్సిపాల్‌కు వ్యతిరేకంగా ఆందోళన చేస్తారా? నిరసన విరమించకపోతే.. ముందుంది మొసళ్ల పండగ.' అంటూ ప్రభుత్వ వైద్య కళాశాలలోని కొందరు హెచ్‌ఓడీలు బెదిరించారని పలువురు మెడికోలు ఆరోపిస్తున్నారు. కేఎస్‌ఎంలోని ప్రభుత్వ వైద్య కళాశాల సమస్యలు పరిష్కరించాలని, ప్రిన్సిపాల్ వేధింపులపై చర్యలు తీసుకోవాలని చేస్తున్న నిరసన కార్యక్రమాన్ని హెచ్‌ఓడీలు అడ్డుకున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించాలని మంగళ, బుధవారాల్లో మెడికోలు ఆందోళన చేపట్టగా, డీఎంఈ వాణి ఆదేశాల మేరకు ఖమ్మం వైద్య కళాశాల ప్రిన్సిపాల్ బృందం, కలెక్టర్ ప్రియాంక అల ఆదేశాల మేరకు జిల్లా అధికారుల బృందం వైద్య కళాశాలలో బుధవారం నుంచి విచారణ చేపడుతున్నాయి. కాగా ధర్నా చేస్తున్న విద్యార్థులను కళాశాల భవనంలోని ఓ గదికి పిలిచి హెచ్‌ఓడీలు హెచ్చరించినట్లు తెలిసింది.

బెదిరింపుల వెనుక ప్రిన్సిపాల్ హస్తం?

రెండు రోజులపాటు వైద్య విద్యార్థులు చేపట్టిన ఆందోళనలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారాయి. దీంతో నిరసన విరమింపజేయాలని ప్రిన్సిపాల్ హెచ్‌ఓడీలపై ఒత్తిడి చేసినట్లు కొందరు విద్యార్థులు చెబుతున్నారు. ప్రాక్టికల్, ఇంటర్నల్ మార్కులు, హాజరు, సెమిస్టర్ పరీక్షలు తదితర కారణాలు చూపి ఆందోళన విరమింపజేయాలని ప్రిన్సిపాల్ సూచించినట్లు సమాచారం. గురువారం ధర్నా చేస్తున్న విద్యార్థులను తరగతి గదుల్లోకి రావాలని వైస్ ప్రిన్సిపాల్ ఫోన్ ద్వారా హెచ్చరించినట్లు తెలుస్తోంది. హెచ్‌వోడీలు, వైస్ ప్రిన్సిపాల్ బెదిరింపులతో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చినా మెడికోలు తలవంచక తప్పలేదని సమాచారం. బెదిరింపుల ఆరోపణలపై కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అనిల్‌ను వివరణ కోరగా.. విచారణ జరుగుతోందని, నివేదిక కలెక్టర్‌కు అందిస్తారని చెప్పుకొచ్చారు. కాగా గురువారం వైస్ ప్రిన్సిపాల్ అనిల్ విద్యార్థులతో మాట్లాడుతూ.. ఇక నుంచి ఏ సమస్య వచ్చినా తానే పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించి తరగతి గదులకు వెళ్లారు.

రచ్చకెక్కిన డీఎంఈ

- మెడికల్ కళాశాలలో మూడు బృందాల విచారణ
- ఇప్పటికే ప్రిన్సిపల్ వేధిస్తున్నారని విద్యార్థుల ఆందోళన
- అక్రమాలకు పాల్పడ్డారని తాజాగా మరో ఫిర్యాదు
- ప్రిన్సిపాల్, జిల్లా సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ మధ్య విభేదాలు

కొత్తగూడెంరూరల్: జిల్లాలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ విభాగం పంచాయితీ రచ్చకెక్కింది. వైద్య కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా సర్వజన ఆస్పత్రి మాజీ సూపరింటెండెంట్ మధ్య నెలకొన్న వివాదం హైదరాబాద్‌లోని డీఎంఈ కార్యాలయంలో ఫిర్యాదులకు దారితీసింది. విద్యార్థుల ఆందోళనతో రెండు రోజులుగా డీఎంఈ, జిల్లా అధికారుల బృందాలు వేర్వేరుగా విచారణ చేస్తున్నాయి. ఈ క్రమంలో మాజీ సూపరింటెండెంట్ కుమారస్వామి ఫిర్యాదుతో గురువారం వైద్య కళాశాలలో మరో విచారణ జరిగింది.

ప్రిన్సిపల్ అక్రమాలకు పాల్పడ్డారు : కుమారస్వామి

జిల్లా సర్వజన ఆస్పత్రి సూపరిండెంటెంట్ కుమారస్వామి విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కలెక్టర్ ప్రియాంక అల ఇటీవల ఆయన్ను డీఎంఈకు సరెండర్ చేశారు. ఈ నేపథ్యంలో ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌రావు అక్రమాలకు పాల్ప డ్డారని, మెడికల్ కళాశాల నిధులు కాజేశారని డీఎంఈకు కుమారస్వామి ఫిర్యాదు చేశారు. దీంతో ఫ్యామిలీ వెల్ఫేర్ ఉన్నతాధికారి కర్ణన్ ఆదేశాలతో అడిషనల్ డైరెక్టర్ అమర్‌సింగ్ నాయక్ గురువారం మెడికల్ కళాశాలకు వచ్చి విచారణ చేపట్టారు. ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌రావు, కుమారస్వామిలతో మాట్లాడి లిఖిత పూర్వకంగా వివరాలు తీసుకున్నారు.

అంతర్గత విభేదాలే కారణమా..

- రెండేళ్ల నుంచి ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌రావు, సూపరిండెంటెంట్ కుమారస్వామి మధ్య అంతర్గత విభేదాలు ఉన్నాయి. ఆస్పత్రిలో కొందరు వ్యక్తులు ఆజ్యం పోయడంతో వివాదం మరింత ముదిరి పంచాయితీ రాష్ట్ర డీఎంఈ కార్యాలయానికి చేరింది.
- కలెక్టర్ ప్రియాంక జిల్లా సర్వజన ఆస్పత్రి సూపరిండెంటెంట్ కుమారస్వామిని సరెండర్ చేశాక, ఆయన స్థానంలో ప్రిన్సిపల్ లక్ష్మణ్‌రావుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. లక్ష్మణ్‌రావు ఆస్పత్రిని గాడిలో నడిపించేందుకు ప్రయత్నించే క్రమంలో, డీఎంఈ వాణి జిల్లా ఆస్పత్రి సూపరిటెండెంట్‌గా రాధామోహన్‌ను నియమించారు.
- వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ఆగడాలు, వేధింపులు భరించలేకపోతున్నామని, కళాశాల సమస్యలు పరిష్కరించాలని 300 మంది మెడికోలు రెండు రోజులు కళాశాల ముందు ధర్నా నిర్వహించారు. ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు విన్నవించారు.
- వార్డెన్‌లు, మరికొందరిని రాత్రి వేళ పంపించి తమ వసతి గదుల్లో వీడియో తీయిస్తున్నారని విద్యార్థులు ప్రిన్సిపాల్‌పై ఆరోపణలు చేశారు. ఈ నేపథ్యంలో డీంఎఈ అధికారులు, జిల్లా అధికారులు వేర్వేరుగా విచారణ చేస్తున్నారు. ఈ నెల 22వ తేదీలోపు కలెక్టర్‌కు విచారణ నివేదిక అందించాల్సిఉంది.

చర్చలకు మేం సిద్ధం..

- ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వమే సానుకూలంగా వ్యవహరించడం లేదు
- మావోయిస్టు పార్టీ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ అధికార ప్రతినిధి వికల్ప్

చర్ల: చర్చలకు తాము సిద్ధంగా ఉన్నప్పటికీ ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వమే సానుకూలంగా స్పందించడం లేదని మావోయిస్టు పార్టీ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ అధికార ప్రతినిధి వికల్ప్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన మీడియాకు లేఖ విడుదల చేశారు. మావోయిస్టులతో చర్చలకు సిద్ధమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి విజయ్‌శర్మ నిరంతరం ప్రకటిస్తున్నారని, తాజాగా బీజాపూర్ జిల్లాలోని జంగ్లాలో కూడా ఈ మేరకు ప్రకటన చేశారని, అయితే చర్చలకు సంబంధించి తాము చేసిన ప్రకటనపై స్పష్టమైన సమాధానం ఇవ్వడం లేదని తెలిపారు. తమ పార్టీ ప్రభుత్వం ముందుంచిన సమస్యలకు సమాధానం ఇవ్వకుండా చర్చల పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని ఆరోపించారు. రైతులు, కార్మికులు, బలహీన వర్గాల ప్రయోజనాలు పరిరక్షించాలనేది తమ ఏకైక డిమాండ్ అని పేర్కొన్నారు. చర్చలకు అనుకూల వాతావరణ కల్పించాలని, ఎన్‌కౌంటర్ల పేరుతో ఆదివాసీలపై దాడులు ఆపాలని, కొత్తగా ఏర్పాటు చేస్తున్న బేస్ క్యాంపులను నిలిపివేయాలని, సాయుధ బలగాలను 6 నెలల పాటు బ్యారక్‌లకు మాత్రమే పరిమితం చేయాలనేది తమ షరతులని వివరించారు. దీనికి ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తే తాము చర్చలకు సిద్ధమని ప్రకటించారు. అ దిశగా ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు పాత్రికేయులు, పౌరులు, ప్రగతిశీల ప్రజాస్వామ్య మేధావులు, పౌర హక్కుల సంఘాలు, మానవహక్కుల సంఘాలు కృషి చేయాలని వికల్ప్ కోరారు.

మట్టి ట్రాక్టర్లకు జరిమానా

చర్ల: మండల కేంద్రంలోని రైస్‌పేటలో ఉన్న ప్రైవేటు చెరువు నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను గురువారం రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. వాహనాలను రెవెన్యూ కార్యాలయానికి తరలించి, ఒక్కో ట్రాక్టర్‌కు రూ.5 వేల చొప్పున జరిమానా విధించి విడిచిపెట్టారు.

'కేజ్రీవాల్ అరెస్టు అక్రమం'

ఖమ్మం మామిళ్లగూడెం: ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం అక్రమమని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు నల్లమోతు తిరుమలరావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బారావు, శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కుట్ర పూరితంగా ఈడీ, సీబీఐలను ప్రతిపక్షాలపై ప్రయోగిస్తోందని ఆరోపించారు. ఎన్నికల సమయాన తమ పార్టీని దెబ్బతీసేందుకే కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేయించారని తెలిపారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

భద్రాచలంఅర్బన్: అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తున్న భర్తపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. భద్రాచలం పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీకి చెందిన కోల్లు సౌమ్యకు 2018 లో కోదాడకు చెందిన నితిన్ అనే వ్యక్తితో వివాహం జరిగింది. వివాహ సమయంలో కట్నం కింద రూ. 5 లక్షల నగదుతోపాటు కొంత బంగారం కూడా ఇచ్చారు. వ్యాపారం చేసుకునేందుకు మరో రూ. 10 లక్షల అదనపు కట్నం కావాలని ఇటీవల కాలంలో నితిన్, అతని తల్లిదండ్రులు నిత్యం వేధిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం తల్లిదండ్రులు ప్రేరేపించడంతో నితిన్ భార్య సౌమ్యపై చేయిచేసుకోవడంతోపాటు దుర్భాషలాడాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నితిన్‌తోపాటు అతని తల్లిదండ్రులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విజయలక్ష్మి తెలిపారు.

సీసీఐ విక్రయాలకు తెర

- మద్దతు ధరకు మించి ప్రైవేట్ మార్కెట్‌లో పత్తికి రేటు
- ఫలితంగా కాటన్ కార్పొరేషన్ కేంద్రాలకు రాని రైతులు
- ఉమ్మడి జిల్లాలో 7.40 లక్షల క్వింటాళ్లు కొన్న సీసీఐ
- మరో 6.90 లక్షల క్వింటాళ్లను కొనుగోలు చేసిన వ్యాపారులు



ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చిన పత్తి

ఖమ్మంవ్యవసాయం: పత్తికి ధర పెరగడంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) కొనుగోలు కేంద్రాలకు తెర పడింది. పత్తికి ప్రభుత్వం రూ.7,020 మద్దతు ధర నిర్ణయించగా.. ప్రస్తుతం ప్రైవేట్ మార్కెట్‌లో అంతకుమించి నాణ్యత ఆధారంగా రూ.7,675 వరకు ధర లభిస్తోంది. దీంతో రైతులు ప్రైవేట్ మార్కెట్‌కు వెళ్తున్న నేపథ్యాన సీసీఐ కొనుగోళ్లు నిలిచిపోయాయి. గడిచిన రెండేళ్లు క్వింటా పత్తికి రూ.8 వేల నుంచి రూ.13 వేల వరకు ధర పలకడంతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల అవసరం లేకుండా పోయింది. ఈ ఏడాది మాత్రం సీజన్‌లో అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ లేకపోవడం, ఎగుమతులు లేకపోవడంతో బేలు, సీడు ధరలు పడిపోయాయి. ఫలితంగా పత్తి ధర రూ.6 వేల నుంచి రూ.6,500గా పలికింది. దీంతో కేంద్ర ప్రభుత్వం తేమ శాతం ఆధారంగా రూ.7,020 గరిష్ట ధర నిర్ణయించి సీసీఐని రంగంలోకి దింపింది. ఈమేరకు నవంబర్ చివరి నుంచి జిల్లాలోని జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోళ్లకు శ్రీకారం చుట్టారు.

ఫిబ్రవరిలో పుంజుకున్న ధర

ఉమ్మడి జిల్లాలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) 7.40 లక్షల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసింది. ఖమ్మం జిల్లాలో పది జిన్నింగ్ మిల్లులను నోటిఫై చేయగా ఎనిమిది మిల్లులు ముందుకొచ్చాయి. వీటి ద్వారా 4,40,175 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేయగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని నాలుగు మిల్లుల్లో 2,94,832 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేశారు. నవంబర్ చివరి వారం నుంచి మార్చి రెండోవారం వరకు కొనుగోళ్లు కొనసాగాయి. అయితే, ఫిబ్రవరి మూడో వారం నుంచే పత్తి ధర పుంజుకుని, నాలుగో వారానికి ప్రైవేట్ మార్కెట్‌లో ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.7,020 మార్క్ దాటింది.

ఆంక్షలతో ఇక్కట్లు

సీసీఐ కేంద్రాల్లో తేమ తదితర ఆంక్షలను కఠినం చేయటంతో రైతులు ఇబ్బందిపడ్డారు. తేమ అధికంగా ఉందని చెబుతూ క్వింటాకు ఆరు నుంచి ఏడు కిలోల తరుగు తీస్తుండగా.. ఇదే అదునుగా వ్యాపారులు రైతుల వద్ద కొనుగోలు చేసిన పత్తిని బినామీ ల పేరిట సీసీఐ కేంద్రాల్లో విక్రయించి లాభాలు దండుకున్నారు. కాగా, సీసీఐ కొనుగోలు చేసిన పత్తికి సంబంధించిన రైతులకు ఇంకా పూర్తిస్థాయిలో నగదు అందలేదు. దీంతో పలువురు రైతులు సీసీఐ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. అయితే, బ్యాంకుఅకౌంట్, ఆధార్ నంబర్ల వంటి సమాచారం సక్రమంగా ఇవ్వకపోవడంతో చెల్లింపుల్లో జాప్యం జరుగుతోందని అధికారులు చెబుతున్నారు.


గ్రామాల్లో వ్యాపారుల కొనుగోళ్లు..

ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ల ద్వారా వ్యాపారులు 7.90లక్షల క్వింటాళ్ల పత్తిని మార్చి మూడో వారం వరకు కొనుగోలు చేశారు. సీసీఐతో పోలిస్తే ప్రైవేట్ వ్యాపారుల కొనుగోళ్లు సు మారు 50వేల క్వింటాళ్ల మేర తక్కువగా ఉన్నాయి. ఖమ్మం జిల్లాలో 5,22,004 క్వింటాళ్లు, భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో 1,69,865 క్వింటాళ్ల పత్తిని ప్రైవేట్ వ్యాపారులు కొనుగోలు చేశారు. ప్రస్తుతం ప్రభుత్వ మద్దతు ధరకు మించి వస్తుండడంతో సీసీఐ కొనుగోళ్లకు తెర పడగా... వ్యవసాయ మార్కెట్లు, గ్రామాల్లో వ్యాపారులు పత్తి కొనుగోళ్లు చేస్తున్నారు.

బేలు, సీడ్ ధర పెరగడంతో డిమాండ్

జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌లో బేలు, సీడ్ ధరలు పెరగటంతో ఇక్కడ పత్తికి డిమాండ్ వచ్చింది. ఫిబ్రవరి ఆరంభం వరకు బేలు(324 కిలోలు) ధర రూ.54వేలు ఉండగా.. ఇప్పుడు రూ.60 వేలకు చేరింది. ఇక రూ.2,400గా ఉన్న సీడ్ క్వింటా ధర రూ.3 వేలకు పెరిగింది. దీంతో రూ.6,600 పలికిన పత్తి ధర ఏకంగా రూ.7,675 చేరడం విశేషం. ఇలా ధర పెరగడంతో నిల్వ చేసిన పత్తిని రైతులు, కొందరు వ్యాపారులు విక్రయానికి మొగ్గ చూపుతున్నారు. కొద్ది రోజులుగా ఖమ్మం తదితర మార్కెట్లో విక్రయాలు పెరిగాయి. పంట సీజన్ ఆరంభంలో ఖమ్మం మార్కెట్‌కు నిత్యం 30 వేల నుంచి 40 వేల బస్తాల పత్తి వచ్చినా సీసీఐ కేంద్రాలు ప్రారంభమయ్యాక తగ్గుముఖం పట్టింది. ప్రస్తుతం ధర పెరగడంతో సీసీఐ కేంద్రాలకు వెళ్లకుండా పంట నిల్వ చేసిన రైతులు వ్యవసాయ మార్కెట్లకు వస్తున్నారు. దీంతో ఖమ్మం మార్కెట్‌కు నిత్యం 3 వేల నుంచి 4 వేల బస్తాల పత్తి విక్రయానికి వస్తోంది.

చెల్లింపులు కొనసాగుతున్నాయి..



ప్రైవేట్ మార్కెట్లలో పత్తికి ధర పెరగడంతో రైతులు అక్కడే పంట విక్రయిస్తున్నారు. దీంతో సీసీఐ కేంద్రాల్లో కొనుగోళ్లు నిలిచిపోయాయి. రైతుల నుంచి కొనుగోలు చేసిన పత్తికి సంబంధించిన పైకం చెల్లింపులు కొనసాగుతున్నాయి. కొందరు సరైన వివరాలు ఇవ్వకపోవడంతో జాప్యం జరుగుతోంది. ఆయా రైతులకు సమాచారం ఇచ్చి వివరాలు సేకరిస్తూ నగదు జమ అయ్యేలా కృషి చేస్తున్నాం.

–ఎం.ఏ.అలీం, ఉమ్మడి జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంచాయితీ

కుటుంబ కలహాల నేపథ్యంలో ఇద్దరిపై దాడి

అశ్వారావుపేట: అశ్వారావుపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంచాయితీకి రమ్మని పిలిచి ఇద్దరు వ్యక్తులను చితకబాదిన సంఘటన గురువారం రాత్రి జరిగింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఏపీలోని గన్నవరం మండలం నిడమనూరు గ్రామానికి చెందిన ముదిగొండ వెంకటరమణకు అశ్వారావుపేట మండలం తిరుమలకుంట గ్రామానికి చెందిన ఓ యువతితో ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరిగింది. కుటుంబ కలహాల నేపథ్యంలో వెంకటరమణపై అతని భార్య అశ్వారావుపేట పోలీస్ స్టేషన్‌లో గత నెలలో ఫిర్యాదు చేసింది. ఈ విషయం పరిష్కరించేందుకు కొందరు పెద్దమనుషులు కబురు చేయగా, గురువారం వెంకటరమణ, అతని సోదరుడు బాలాజీ అశ్వారావుపేటకు వచ్చారు. అధికార పార్టీకి చెందిన ఓ వ్యక్తి స్థానిక ఫైర్ కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి పంచాయితీ పెట్టారు. అక్కడ మాట్లాడుతుండగా వెంకటరమణ బావమరిది హరీష్, అత్త సామ్రాజ్యం, చిన మామయ్య సురేష్ తదితరులు వెంకటరమణ, అతని సోదరుడిపై తీవ్రంగా దాడి చేసినట్లు తెలుస్తోంది. ఈవిషయమై బాధితులు అశ్వారావుపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించగా తొలుత ఫిర్యాదు స్వీకరించనట్లు తెలుస్తోంది. ఆతర్వాత తెలంగాణలోని ఓ మంత్రి తరపు వ్యక్తులు మందలించడంతో పోలీసులు బాధితుల ఆవేదన విన్నట్లు సమాచారం. కాగా విషయమై ఎటువంటి కేసు నమోదు కాలేదు. మరోసారి పెద్దమనుషుల సమక్షంలో మాట్లాడుకోవాలని అవకాశం ఇచ్చినట్లు సమాచారం. ఈ ఘటనపై ఎస్‌ఐ ఎస్‌ఐ శ్రీరాముల శ్రీనును ఫోన్ ద్వారా వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. ఆయన స్పందించలేదు. తమకు విషయం తెలియదని పోలీస్‌స్టేషన్‌లో రాత్రి విధుల్లో ఉన్న సిబ్బంది తెలిపారు.

ఉపాధి మార్గం చూపాలి



రథయాత్రలో పాల్గొన్న ఆటో కార్మికులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం కల్పించడం వల్ల ఆటోలకు కిరాయిలు దొరకక డ్రైవర్లు దుర్భర జీవనం గడుపుతున్నారని టీఏడీయూ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఆటో బతుకుల రథయాత్ర గురువారం కొత్తగూడెం చేరుకుంది. టీఏడీయూ నాయకుడు మర్రి కృష్ణ తదితరులు బస్టాండ్ సెంటర్‌లో రథయాత్రకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు చూపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి బుల్లితెర నటులు రవికుమార్, దారా మధు హాజరై ఆటో కార్మికుల కష్టాలపై సీరియల్ రూపొందించామని, కార్మికులు ఆదరించాలని కోరారు. టీఏడీయూ పట్టణ కార్యదర్శి మాటేటి వెంకట్ అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ధర్మపురి నరేష్, గుండ్ల రాజు, జీడి శ్రీను, లకావత్ రమేష్, చిలక వెంకట్, చంటి, మాధవరావు, శ్రీకర్, చందు తదితరులు పాల్గొన్నారు.

జూదరులకు కౌన్సెలింగ్

అశ్వారావుపేట: కోడి పందేలు, పేకాటకు బానిసలైన ముగ్గురు యువకులకు ఎస్‌ఐ శ్రీరాముల శ్రీను గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో, వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ వి.కృష్ణప్రసాద్ సక్షమంలో బైండోవర్ చేసి రూ.2 లక్షల పూచీకత్తుపై విడుదల చేశారు. తిరిగి జూదానికి పాల్పడితే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

గ్యాస్ సిలిండర్ లీకై ఇల్లు దగ్ధం

చుంచుపల్లి: మండలంలోని చుంచుపల్లి తండాకు చెందిన భూక్య మంగ్యా అనే వ్యక్తి ఇంట్లో గురువారం రాత్రి గ్యాస్ సిలిండర్ లీకై ఇంటికి మంటలు అంటుకున్నాయి. ఈ సమాచారం తెలుసుకున్న స్థానిక ఎస్సై గడ్డం ప్రవీణ్ కుమార్ వెంటనే తన సిబ్బందితో అక్కడికి చేరుకొని సమయ స్ఫూర్తిని ప్రదర్శించి మంటలను అదుపు చేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఎస్సైకి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

అప్పుల బాధతో ఆర్టిజన్ ఆత్మహత్య



శేషం రాజు(ఫైల్)

భద్రాచలంఅర్బన్/పాల్వంచ: బ్రిడ్జిపై నుంచి గోదావరిలో దూకి కేటీపీఎస్ కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పాల్వంచ పట్టణంలోని జయమ్మ కాలనీకి చెందిన, కేటీపీఎస్ ఆర్టిజన్ ఉద్యోగి తంగెళ్ల శేషంరాజు (40) పిల్లల చదువులకు కోసం అప్పు చేశాడు. అప్పుల బాధ భరించలేక కొంతకాలంగా మనోవేదనకు గురవుతున్నాడు. బుధవారం బంధువుల ఇంటికి వెళ్లొచ్చిన ఆయన మరింత వేదనతో కనిపించాడు. భార్య శైలజ ఆరా తీసినా ఏమీ లేదంటూ ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. గురువారం శేషంరాజు భద్రాచలం వద్ద బ్రిడ్జిపై నుంచి గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ విజయలక్ష్మి కేసు నమోదు చేశారు. కాగా పాల్వంచ జయమ్మ కాలనీలోని రాజు నివాసగృహం వద్ద మృతదేహాన్ని కార్మిక సంఘాల నేతలు చారుగుండ్ల రమేశ్, కె.రవికుమార్, తోట కోటేశ్వరరావు, ఆర్.శ్రీనివాస్, ముత్యాల రాంబాబు, సల్లం పరమేశ్, కాల్వ రవికుమార్, సుభాని, రాంబాబు, రవిబాబు, డి.రాధాకృష్ణ, ఎం.నర్సింహా రెడ్డి తదితరులు సందర్శించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

క్లుప్తంగా...

ప్రణీత్‌రావు పిటిషన్ కొట్టివేత

సాక్షి, హైదరాబాద్: సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం తన విచారణ జరగడం లేదంటూ స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. కస్టడీ సమయంలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పాటించడం లేదని, పీఎస్‌లో నిద్రపోవడానికి సరైన సౌకర్యాలు లేవని, విచారణ పూర్తైన తర్వాత తిరిగి జైలుకు తరలించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరడంతోపాటు పోలీస్ కస్టడీకి ఇస్తూ ట్రయల్ కోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ ప్రణీత్‌రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌లో వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి.. పిటిషన్‌ను కొట్టివేస్తూ గురువారం తీర్పు వెలువరించారు. 2023లో అక్రమంగా ప్రతిపక్ష పార్టీ నేతల ఫోన్ ట్యాంపింగ్‌కు ప్రణీత్‌రావు పాల్పడ్డారు. ఇది చాలా తీవ్ర నేరమని.. నిబంధనల మేరకే ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ చేస్తోందని వాదనల సందర్భంగా పీపీ నివేదించారు. సాక్ష్యాలను అందించడంలో భాగంగానే రమేశ్ విచారణ జరిగే ప్రాంతానికి వచ్చారు తప్ప.. విచారణలో పాల్గొనలేదన్నారు. 4 రోజుల కస్టడీ పూర్తయిందని, మరో 3 రోజులు మాత్రమే ఉందని చెప్పారు. పీపీ వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి ప్రణీత్‌రావు పిటిషన్ కొట్టివేశారు.

నా కొడుకును రక్షించండి

అబ్దుల్ మహ్మద్ ఆర్ఫద్ తండ్రి సలీం వేడుకోలు

మల్లాపూర్(హైదరాబాద్): అమెరికాలో కిడ్నాప్‌నకు గురైన తన కొడుకు అబ్దుల్ మహ్మద్ ఆర్ఫద్‌ను కాపాడాలని తండ్రి అబ్దుల్ సలీం ఆవేదనతో వేడుకుంటున్నాడు. నాచారం ఏరియాకు చెందిన ఆర్ఫద్‌ను అమెరికాలో డ్రగ్స్ మాఫియా కిడ్నాప్ చేసిన విషయం తెలిసిందే. గురువారం మీడియాతో మాట్లాడుతూ రెండు రోజులైనా ఫోన్ రాకపోవడంతో అక్కడే ఉన్న తమ బంధువులకు సమాచారం ఇచ్చినా, వారికి కూడా అతని ఆచూకీ తెలియలేదన్నారు. కిడ్నాపర్ల చెర నుంచి తన కొడుకు రక్షించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాడు.

పోలీసుల ఆరా

ఆర్ఫద్ కిడ్నాప్ విషయం తెలుసుకున్న నాచారం పోలీసులు తండ్రి సలీంను పీఎస్‌కు పిలిచి ఆరా తీశారు. ఆర్ఫద్ ఎప్పుడు అమెరికాకు వెళ్లాడు.. చివరిసారి ఎప్పుడు మాట్లాడాడు, అమెరికాలో ఎక్కడ ఉంటున్నాడు.. ఇంతకు ముందు ఎవరైనా అక్కడ బెదిరింపులకు పాల్పడుతున్నట్టు చెప్పాడా అనే కోణంలో వివరాలు అడిగారు.

యాదాద్రిలో ముగిసిన బ్రహ్మోత్సవాలు



గురువారం యాదాద్రిలో ప్రధాన కలశంతో పాటు వెండి, బంగారు కలశాలకు పూజలు చేస్తున్న ఆచార్యులు, యజ్ఞాచార్యులు.

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిశాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజైన గురువారం ప్రధానాలయంలో వేకువజామున నిత్య పూజలు నిర్వహించిన ఆచార్యులు వేద మంత్రాలతో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు శ్రీస్వామి అమ్మవార్లకు అష్టోత్తర శతఘటాభిషేకం చేశారు. 108 కలశాలలో ఫల రసాలతో, పంచామృతాలతో, శుద్ధ జలంతో స్వయంభూలకు, బంగారు ప్రతిష్ఠామూర్తులకు వేద మంత్రాలు, పారాయణాలతో శతఘటాభిషేక మహోత్సవం జరిపారు. రాత్రి 9.30 గంటలకు శ్రీస్వామి వారికి శృంగార డోలోత్సవం ఘనంగా జరిపించి ఉత్సవాలకు ముగింపు పలికారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా రద్దు చేసిన నిత్య కళ్యాణం, సుదర్శన నారసింహ హోమం వేడుకలు శుక్రవారం నుంచి పునః ప్రారంభం కానున్నాయి. కాగా ఉదయం, సాయంత్రం జరిగిన వేడుకల్లో ఈఓ భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఆలయ ప్రధానార్చకులు, అధికారులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా ధర్మపురి నృసింహుడి కల్యాణం



నృసింహుడి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

ధర్మపురి: జగిత్యాల జిల్లాలోని ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండోరోజైన గురువారం ఆలయంలోని శేషప్ప వేదికపై ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్వామివారి కళ్యాణాన్ని కన్నుల పండువగా జరిపించారు. ప్రభుత్వం తరఫున కలెక్టర్ యాస్మిన్ బాషా పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 50 వేల మంది భక్తులు తరలివచ్చారు. రాత్రి ఏడు గంటల నుంచి తొమ్మిది గంటలవరకు వేడుక జరిపించారు. ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, జాయింట్ కలెక్టర్ రాంబాబు డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

అజ్ఞాతంలోకి ప్రభాకర్‌రావు!

ప్రణీత్‌రావు సస్పెండ్ కాగానే ఎస్‌ఐబీ మాజీ చీఫ్ అప్రమత్తం

- ప్రస్తుతం అమెరికాలో ఉన్నట్లు పోలీసుల అనుమానం
- మాజీ డీఎస్పీ కస్టడీ ముగిసిన తర్వాత హైకోర్టును ఆశ్రయించే అవకాశం
- 2018 నుంచే మొదలైన అక్రమ ట్యాపింగ్ దందా
- ఇజ్రాయెల్ నుంచి అత్యాధునిక ఉపకరణాలు ఖరీదు



సాక్షి, హైదరాబాద్: అక్రమ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కర్త, కర్మ, క్రియగా వ్యవహరించిన స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు అజ్ఞాతంలోకి వెళ్లినట్టుగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఈయన ప్రస్తుతం అమెరికాలో ఉన్నట్లు భావిస్తున్నారు. ప్రణీత్ రావు కేసును అక్కడి నుంచే నిశితంగా గమనిస్తున్న ప్రభాకర్‌రావు.. అతని పోలీసు కస్టడీ ముగిసిన తర్వాత హైకోర్టును ఆశ్రయించే అవకాశం ఉందని తెలుస్తోంది. మరోపక్క సిట్ అధికారులు ప్రణీత్ రావును ఐదో రోజైన గురువారమూ బంజారాహిల్స్ ఠాణాలో ప్రశ్నించారు. తాజాగా వెలుగులోకి వచ్చిన వివరాల ఆధారంగా మరో నలుగురు పోలీసులకు నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. వీళ్లు గతంలో 'ప్రభాకర్‌రావు సైన్యం'లో కీలక సభ్యులని సమాచారం.

హోదా ఏదైనా బాధ్యత మాత్రం చీఫే

రాష్ట్రం ఏర్పడిన తర్వాత కొన్నాళ్లు హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) డీసీపీగా పని చేసిన ప్రభాకర్‌రావును ప్రభుత్వం ఏరికోరి ఎస్ఐబీకి డీఐజీని చేసింది. ఐజీగా పదోన్నతి పొందినా అక్కడే కొనసాగారు. చివరకు 2020లో పదవీ విరమణ చేసిన ప్రభాకర్‌రావును నాటి ప్రభుత్వం ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్డీ)గా నియమించింది. హోదా ఏదైనా ఎస్ఐబీ చీఫ్‌గానే కొనసాగారు. ఇలా ఏళ్లుగా అక్కడ పాతుకుపోయిన ప్రభాకర్‌రావు తనకంటూ ఓ సైన్యాన్ని ఏర్పాటు చేసుకున్నారు.

గత ఎన్నికల నేపథ్యంలోనే అడ్డదారి

ఎస్ఐబీలో 2017 వరకు లీగల్ ఇంటర్‌సెప్షన్ (ఎల్ఐ)గా పిలిచే అధికారిక ట్యాపింగ్ మాత్రమే జరిగింది. అయితే ఆ తర్వాత ఎన్నికలు సమీపిస్తుండటం, ప్రతిపక్ష పార్టీలు పుంజుకోవడం గమనించిన ప్రభాకర్‌రావు, అప్పటి కొందరు కీలక రాజకీయ నాయకులు.. అక్రమ ట్యాపింగ్‌పై దృష్టి పెట్టారు. అయితే ప్రతిపక్ష నేతలు తరచుగా వేర్వేరు నంబర్లతో సంప్రదింపులు జరుపుతుండటంతో ప్రభాకర్‌రావు బృందం రష్యా, ఇజ్రాయెల్‌లో పర్యటించి వచ్చింది. ఆయా దేశాల్లో అందుబాటులో ఉన్న ఆధునిక ట్యా పింగ్, ఇతర నిఘా పరికరాలను పరిశీలించి వచ్చింది. ఏవేవి ఖరీదు చేయాలో చెప్పాల్సిందిగా పేర్కొంటూ కొందరు పెద్దలకు నివేదిక సమర్పించింది.

కొనుగోలులో కీలక పాత్ర పోషించిన రవి పాల్

టెక్నికల్ అనుభవం ఉన్న రవి పాల్ అనే నిపుణుడు గతంలో ఇంటెలిజెన్స్ విభాగానికి కన్సల్టెంట్, అడ్వైజర్‌గా పని చేశారు. ప్రభాకర్‌రావుతో పాటు కొందరు కీలక అధికారులతో సన్నిహితంగా మెలిగారు. రవి పాల్ సూచనల మేరకు ప్రభాకర్‌రావు ఇజ్రాయెల్ నుంచి సూట్‌కేస్‌లో ఇమిడిపోయి ఉండే అక్రమ ట్యాపింగ్ పరికరం ఖరీదు చేశారు. దీన్ని ప్రణీత్‌రావు టీమ్ ఓ వాహనంలో పెట్టుకుని టార్గెట్ చేసిన వ్యక్తి ఇల్లు, కార్యాలయం సమీపంలో మాటు వేసేది. ఈ పరికరానికి 300 మీటర్ల పరిధిలో ఉన్న ప్రతి ఫోన్ ద్వారా జరిగే కమ్యూనికేషన్ తెలుసుకునే సామర్థ్యం ఉంది.

'ఆదిలాబాద్'కోసం వినియోగించారు

2018లో ఆదిలాబాద్‌లో రెండు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొన్న సమయంలోనూ ఎస్ఐబీ అధికారులు ఈ బ్రీఫ్‌కేస్ ఉపకరణాన్ని వినియోగించారు. రెండు వర్గాలకు చెందిన కీలక నేతలు ఇద్దరిని పట్టుకోగలిగారు. ఈ వ్యవహారాల్లో ప్రణీత్ రావుకు కుడిభుజంగా వ్యవహరించిన ఆరుగురు అధికారులను సిట్ గుర్తించింది. వీరిలో ఇద్దరి నుంచి ఇప్పటికే వాంగ్మూలాలు నమోదు చేయగా.. మరో నలుగురికి విచారణకు హాజరుకావాలని ఆదేశిస్తూ నోటీసులు జారీ చేసింది.

ప్రణీత్‌రావు సస్పెన్షన్‌తో అలెర్ట్

గత ఏడాది డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అధికార మార్పిడి జరిగిన వెంటనే ప్రభాకర్‌రావు తన ఓఎస్డీ పోస్టుకు రాజీనామా చేశారు. ఆపై కొన్నాళ్లు హైదరాబాద్‌తో పాటు తన స్వగ్రామంలో ఉన్నారు. అయితే ఈ నెల మొదటి వారంలో ప్రణీత్ రావుపై సస్పెన్షన్ వేటు పడటంతో అప్రమత్తం అయ్యారు. కుటుంబంతో కలిసి విహార యాత్రకు వెళ్తున్నట్లు చెప్పి నగరం దాటిన ప్రభాకర్‌రావు అట్నుంచి అటు అమెరికా వెళ్లిపోయారని పోలీసులు భావిస్తున్నారు. ప్రణీత్ రావు కస్టడీ ముగిసిన తర్వాత ప్రభాకర్‌రావు విషయంలో పోలీసు విభాగం కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.

పకడ్బందీగా ఎన్నికల కోడ్ అమలు

సమీక్షలో సీఎస్ శాంతికుమారి ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అధికారులను ఆదేశించారు. పోలీసు, ఎక్సైజ్, వాణిజ్య పన్నులు, అటవీ, రెవెన్యూ, రవాణా తదితర శాఖల అధికారులతో గురువారం ఆమె సచివాలయంలో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఎలా పనిచేశారో.. అదే స్ఫూర్తితో రానున్న లోక్‌సభ ఎన్నికల నిర్వహణలోనూ మరింత సమర్థవంతంగా పని చేయాలని కోరారు. మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దుల్లో చెక్ పోస్టులను ఏర్పాటు చేయడంతో పాటు ఆయా రాష్ట్రాల చెక్ పోస్టులతో కలసి సమన్వయంతో పటిష్ట నిఘా ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంలో కూడా వివిధ శాఖలు చెక్ పోస్టులను ఏర్పాటు చేశాయన్నారు. ఇప్పటివరకు పోలీసు శాఖ రూ.10 కోట్ల నగదు, పలు లైసెన్స్ లేని ఆయుధాలు, పేలుడు పదార్థాలు, జిలెటిన్ స్టిక్స్, బంగారాన్ని స్వాధీనం చేసుకుందని తెలిపారు. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు వివిధ వస్తువులను నిల్వ చేసేందుకు అవకాశమున్న 25 గోదాములను గుర్తించి వాటిపై ప్రత్యేక నిఘా ఉంచామని వెల్లడించారు. మరో 141 గోదాములు, 912 వివిధ వస్తువుల తయారీ కేంద్రాలపై కూడా నిఘా ఉంచామన్నారు. మద్యం అక్రమ రవాణాకు అవకాశమున్న ఐదు రైలు మార్గాలను గుర్తించి మద్యం నిరోధానికి ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఈ సమావేశంలో డీజీపీ రవిగుప్తా, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సునీల్ శర్మ, పీసీసీఎఫ్ డోబ్రియల్, హోం శాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్, అడిషనల్ డీజీ ఎస్.కె. జైన్ పాల్గొన్నారు.

ఎన్నికల బందోబస్తుకు 145 కంపెనీల కేంద్ర బలగాలు



- ఇప్పటికే రంగంలోకి 60 కంపెనీలు
- శాంతిభద్రతల అదనపు డీజీ సంజయ్ కుమార్ జైన్

సాక్షి, హైదరాబాద్: త్వరలో జరగనున్న పార్లమెంటు ఎన్నికలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు శాంతిభద్రతల అదనపు డీజీ సంజయ్‌కుమార్ జైన్ తెలిపారు. ఎన్నికల తేదీనాటికి మొత్తం 145 కంపెనీల కేంద్ర బలగాలు బందోబస్తు విధుల్లో ఉండే అవకాశం ఉన్నట్టు చెప్పారు. కేంద్ర ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని గురువారం ఆయన 'సాక్షి'కి తెలిపారు. స్థానిక పోలీసులతోపాటు ఇప్పటికే 60 కంపెనీల కేంద్ర బలగాలు రాష్ట్రవ్యాప్తంగా బందోబస్తు విధుల్లో పాల్గొంటున్నట్టు వెల్లడించారు. నిబంధనల ప్రకారం ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి కనీసం మూడుకు తగ్గకుండా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 440 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, నిరంతరం తనిఖీలు చేస్తున్నట్టు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా పోలీసు తనిఖీల్లో ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.10 కోట్ల వరకు నగదును స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో కవాతు నిర్వహిస్తున్నామని సంజయ్‌కుమార్ జైన్ వెల్లడించారు.

జిల్లా వార్తలు

పెద్దాస్పత్రిలో మోకీలు శస్త్రచికిత్స



మల్లేశ్వరి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న ఆస్పత్రి అధికారులు

ఖమ్మంవైద్యవిభాగం: చాన్నాళ్ల తర్వాత ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో వైద్యులు మోకీలు శస్త్రచికిత్స నిర్వహించారు. జూలూరుపాడుకు చెందిన ఏ.మల్లేశ్వరి(56) మూడేళ్లుగా మోకాళ్ల నొప్పులతో ఇబ్బంది పడుతుండగా, నడవడం కష్టంగా మారటంతో పెద్దాస్పత్రిలోని ఆర్థో వైద్యులను సంప్రదించింది. పరీక్షించిన వైద్యులు ఆమె మోకీళ్లు పూర్తిగా అరిగినట్లు గుర్తించారు. గత వారం ఆమెకు శస్త్రచికిత్స చేయగా ప్రస్తుతం కోలుకోవడంతో గురువారం ఆమెను డిశ్చార్జ్ చేశారు. సుమారు రూ.2 లక్షల విలువైన మోకీలు శస్త్రచికిత్సను ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా చేసినట్లు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు, సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ బి.కిరణ్‌కుమార్ తెలిపారు.


పీఎంఓ నుంచి కేన్సర్ బాధితుడికి రూ.3 లక్షలు

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్ఎస్ లోక్‌సభా పక్షనేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు చొరవతో కేన్సర్ బాధితునికి ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుంచి రూ.3 లక్షల ఆర్థికసాయం మంజూరైంది. ఈమేరకు పీఎంఓ నుంచి ఎంపీ నామకు లేఖ అందింది. వైరా మండలం సోమవరం గ్రామం సుందరయ్యనగర్‌కు చెందిన కట్ల శ్రీకాంత్ కుమారుడు ధృవంశ్ కేన్సర్‌తో బాధపడుతూ సికింద్రాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మెరుగైన చికిత్స కోసం పెద్దమొత్తంలో డబ్బు అవసరం కావడంతో శ్రీకాంత్ ఎంపీని ఆశ్రయించాడు. దీంతో ఆయన ప్రధానమంత్రి కార్యాలయంతో మాట్లాడి రూ.3 లక్షలు మంజూరు చేయించగా, బాధిత కుటుంబం ఎంపీకి కృతజ్ఞతలు తెలిపింది.

అభివృద్ధి, మనుగడే ధ్యేయంగా..

'గూడెం'లో నడుం బిగించిన వ్యాపార సంఘాలు

- 14 అంశాల సాధనే లక్ష్యంగా ముందడుగు
- సీఎం, డిప్యూటీ సీఎం, సీఎస్‌లకు పోస్టుకార్డులు
- కలెక్టర్, ఎమ్మెల్యే, ఎస్పీకి నేరుగా వినతి




సీఎం, మంత్రులు, సీఎస్‌కు పంపిస్తున్న పోస్టు కార్డులు



కలెక్టర్‌తో చర్చిస్తున్న వ్యాపార సంఘం ప్రతినిధులు (ఫైల్)

కొత్తగూడెంఅర్బన్: పారిశ్రామిక ప్రాంతమైన కొత్తగూడెంలో బొగ్గు తవ్వకాల ప్రారంభ సమయాన సింగరేణి అధికారుల సూచనల మేరకు ఇక్కడ వ్యాపారాలు ఏర్పాటుచేసిన వారు తిరిగి వెళ్లిపోతున్నారు. ఈనేపథ్యాన వ్యాపారులు వలస వెళ్లకుండా చూస్తూనే, పట్టణ అభివృద్ధే ధ్యేయంగా కొత్తగూడెం వ్యాపారుల సంక్షేమ సంఘం నడుం బిగించింది. కొన్నేళ్ల క్రితం వరకు సింగరేణి ఉద్యోగులు, పట్టణానికి రోజూ వచ్చివెళ్లే ప్రజలతో వ్యాపారాలు బాగా నడిచేవి. కానీ ఆన్‌లైన్, కార్పొరేట్ సంస్థల తాకిడికి వస్త్రదుకాణాలు, కిరాణా, బంగారం, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్.. ఇలా ఒకటేమిటి అన్నీ మూతపడే స్థితికి చేరాయి. గత ఐదేళ్లలో పట్టణం నుంచి సుమారు 6 వేల కుటుంబాల్లోని 20వేల మంది వలస వెళ్లినట్లు వ్యాపార సంఘం నాయకులు అంచనా వేస్తున్నారు. దీంతో వలసలను అరికట్టి పట్టణాభివృద్ధికి నడుం బిగించిన వ్యాపారస్తులు సమైక్యమై 'కొత్తగూడెం వ్యాపారస్తుల సంక్షేమ సంఘం'గా ఏర్పడ్డారు. వీరి ఆధ్వర్యాన పట్టణ అభివృద్ధి ప్రణాళిక రూపొందించి ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆచరణ రూపం దాల్చేలా కృషి చేస్తున్నారు.

పట్టణాభివృద్ధే ధ్యేయంగా ముందుకు..



కొత్తగూడెం పట్టణాభివృద్ధి, మనుగడ కోసం 14 అంశాలతో నివేదిక రూపొందించాం. వీటి సాధనకు ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీని కలిశాం. అలాగే, సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు, సీఎస్‌కు పోస్టుకార్డులు పంపించాం. అందరూ సహకరిస్తే ఈ అంశాలు ఆచరణలోకి వచ్చి పట్టణాభివృద్ధి సాధ్యమవుతుందనే నమ్మకం ఉంది.

– మొరిశెట్టి భవానీప్రసాద్, సంఘం కన్వీనర్

నివేదికలోని కొన్ని అంశాలు..

కొత్తగూడెం పట్టణాభివృద్ధి కోసం 14 అంశాలను రూపొందించిన సంఘం బాధ్యులు వాటి సాధనకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నారు. ఊరు అభివృద్ధి జరిగితే అన్ని వర్గాల వారికి పురోగతి ఉంటుందనే నమ్మకంతో ముందుకు వెళ్తున్నారు. రాజకీయ పార్టీల నాయకులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, మేధావులు జిల్లా కేంద్రంగా ఉన్న కొత్తగూడెం మనుగడ కోసం ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని కోరుతున్నారు. ఈ మేరకు వారు రూపొందించిన అంశాల్లో కొన్ని ఇలా ఉన్నాయి.

- కొత్తగూడెం రైతుబజార్, కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న విశాలమైన స్థలాన్ని అభివృద్ధి చేసి సెంటర్‌గా తీర్చిదిద్దాలి. రైతుబజార్ స్థలంలో జీ ప్లస్ 4 పద్ధతిలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తే వ్యాపారాలు మళ్లీ జీవం పోసుకుంటాయి.
- కొత్తగూడెం నుంచి ప్రతిరోజూ కనీసం నాలుగు రైళ్ల రాకపోకలు జరిగేలా చూడాలి. తద్వారా భద్రాచలానికి వెళ్లి వచ్చే భక్తులతో ఇక్కడ వ్యాపారాల అభివృద్ధికి అవకాశం ఉంటుంది.
- జిల్లాలో సింగరేణి, ఐటీసీ, హెవీవాటర్‌ప్లాంట్, ఎన్ఎండీసీ, కేటీపీఎస్, బీటీపీఎస్, నవభారత్ లాంటి సంస్థలు, వాటి అనుబంధ పరిశ్రమలు ఉన్నందున పారిశ్రామిక వేత్తలు, భద్రాచలానికి వచ్చివెళ్లే భక్తుల సౌకర్యార్థం కొత్తగూడెంలో విమానాశ్రయం ఏర్పాటు చేయాలి.
- ఐటీ టవర్స్, మైనింగ్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తే కొత్త కోర్సులు రావడంతో పాటు విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది.
- అసంపూర్తిగా ఉన్న కొత్తగూడెం బైపాస్ రోడ్డు, జాతీయ రహదారి నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలి.

'సహజ' ప్రతిభ సొంతం!

- టెన్నిస్‌లో సత్తా చాటుతున్న ఖమ్మం క్రీడాకారిణి
- అమెరికాలో స్పోర్ట్స్ కోటా ద్వారా ఉచిత చదువు
- అంతర్జాతీయ టోర్నీలకు వెళ్లేందుకు చేయూత కోసం ఎదురుచూపులు



ప్రాక్టీస్ చేస్తున్న సహజ

ఖమ్మం స్పోర్ట్స్: టెన్నిస్‌లో అంతర్జాతీయ స్థాయి గుర్తింపు సాధించి జిల్లా కీర్తిని చాటుతోంది ఖమ్మంకు చెందిన యామలపల్లి సహజ. టెన్నిస్‌పై బాల్యం నుంచే ఆసక్తి పెంచుకున్న ఆమెకు మరింత ఎత్తు ఎదగాలనే ఆకాంక్ష ఉన్నా స్థోమత లేక దాతల చేయూత కోసం ఎదురుచూస్తోంది. తల్లిదండ్రులు ఉద్యోగ నిమిత్తం హైదరాబాద్‌లో ఉన్న సమయాన అక్కడ శిక్షణలో రాటుదేలి జాతీయస్థాయి సెలక్టర్ల దృష్టిలో పడింది. అంచెలంచెలుగా ఎదిగుతూ భారత మహిళల టెన్నిస్ జట్టులో స్థానం సంపాదించుకుంది. ఈక్రమంలోనే జూనియర్ కేటగిరీలో 20వ ర్యాంకు సాధించడం విశేషం. అలాగే, వచ్చే నెల చైనాలో జరగనున్న టోర్నీకి భారత జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనుంది. అయితే, అంతర్జాతీయ టోర్నీల్లో ఆడాలన్నా, అందుకు తగిన శిక్షణ పొందాలన్నా ఏటా రూ.30 లక్షల వరకు అవసరం కావడంతో స్పాన్సర్ల కోసం సహజ ఎదురుచూస్తోంది.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో...

ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పదో ఏట నుంచే రాకెట్ పట్టిన సహజ అంచెలంచెలుగా ఎదిగింది. ఆమె తల్లిదండ్రులు భవానీప్రసాద్, సుప్రియ ఉద్యోగరీత్యా హైదరాబాద్ వెళ్తూ సహజకు సైతం అక్కడే శిక్షణ ఇప్పించారు. కొద్ది కాలం తర్వాత ఉన్నత చదువుల నిమిత్తం అమెరికా వెళ్లిన ఆమె ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రీషన్‌లో స్పోర్ట్స్ స్కాలర్‌షిప్‌తోనే ఉచితంగా డిగ్రీ పూర్తి చేసింది. అక్కడ టెన్నిస్ నేర్చుకునేందుకు ఫీజు కట్టలేని స్థితిలో ఉన్న యూట్యూబ్ ద్వారా పాఠాలు నేర్చుకుంది. అలాగే, అక్కడ అనేక టోర్నీల్లో సత్తా చాటింది. రెండేళ్ల క్రితం తిరిగి రాగా ప్రస్తుతం బెంగళూరులోని పీటీఐ టెన్నిస్ అకాడమీలో సీజర్‌మొరాల్స్ వద్ద శిక్షణ పొందుతోంది. 2021లో ప్రపంచ ర్యాంకింగ్‌లో 1,300 స్థానంలో ఉన్న సహజ ఇప్పుడు ప్రపంచ ర్యాంకింగ్‌లో 306, నేషనల్ ర్యాంకింగ్‌లో ద్వితీయ స్థానం, తెలంగాణలో మొదటి స్థానానికి చేరింది. మధ్య తరగతి కుటుంబానికి చెందిన సహజకు చేయూతనిచ్చేందుకు స్పాన్సర్లు ముందుకొస్తే దేశానికి ఖ్యాతి తీసుకొచ్చేలా సత్తా చాటే అవకాశముంది.

రేగళ్ల గుంపును సందర్శించిన డీడబ్ల్యూఓ

- ట్రాక్టర్‌పై ప్రయాణం.. ఆపై కాలినడక
- గొత్తికోయల సమస్యలపై ఆరా



రేగళ్లగుంపులో గొత్తికోయలతో మాట్లాడుతున్న డీడబ్ల్యూఓ విజేత



ట్రాక్టర్‌పై వెళ్తున్న డీడబ్ల్యూఓ, తదితరులు

అశ్వారావుపేట: అశ్వారావుపేట మండలం బచ్చువారిగూడెం గ్రామపంచాయతీ పరిధి రేగళ్ల గొత్తికోయల గుంపును భద్రాద్రి జిల్లా సంక్షేమాధికారి వేల్పుల విజేత గురువారం సాయంత్రం సందర్శించారు. రహదారి సౌకర్యం సరిగ్గా లేని గుంపును చేరుకునేందుకు ఆమె ఉద్యోగులతో కలిసి ట్రాక్టర్‌పై ప్రయాణించారు. ఆతర్వాత కాసేపు కాలినడకన వెళ్లి గుంపునకు చేరుకున్నారు. అక్కడ వలస గొత్తికోయలకు అందుతున్న సేవలను పరిశీలించి వారి స్థితిగతులను తెలుసుకున్నారు. ఆతర్వాత అశ్వారావుపేటలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో విజేత విలేకరులతో మాట్లాడారు. రేగళ్ల గుంపులో తాగునీటి సౌకర్యం, వైద్య సేవలు కావాలని అక్కడి ప్రజలు కోరారని తెలిపారు. గొత్తికోయల యువతుల్లో చదువుకున్న వారు ఉంటే అక్కడే అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేసి ఉద్యోగం ఇచ్చేలా ఉన్నతాధికారులతో మాట్లాడి అనుమతి తీసుకుంటామని చెప్పారు. తద్వారా పిల్లలు, గర్భిణుల్లో పౌష్టికాహార లోపం తలెత్తకుండా చూడవచ్చని తెలిపారు. మిగతా సమస్యలను కూడా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఆమె వెంట ఐసీడీఎస్ పీఓ రోజాకుమారి, సిబ్బంది ఉన్నారు. కాగా, ఇటీవలే రేగళ్లగుంపులో తాగునీటి సమస్యపై 'సాక్షి'లో కథనం ప్రచురితం కాగా స్పందించిన అధికారులు ట్యాంకర్ ద్వారా నీరు సమకూరుస్తున్న విషయం విదితమే.

దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద తగ్గుతున్న గోదావరి



కుమ్మరిగూడెంలో ఆనకట్ట గోదావరి

అశ్వాపురం: అశ్వాపురం మండలం కుమ్మరిగూడెంలో గోదావరి నదిపై ఉన్న దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద నీటిమట్టం క్రమంగా తగ్గుతోంది. ఆనకట్ట వద్ద గురువారం 49.3 మీటర్లుగా నమోదు కాగా, మిషన్ భగీరథ ఇన్ టేక్‌వెల్ వద్ద నీటిమట్టం 48.9 మీటర్లు ఉంది. ఇన్ టేక్‌వెల్ ద్వారా భద్రాద్రి జిల్లా వ్యాప్తంగా గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతోంది. ఇక్కడ నీటిమట్టం 48 మీటర్ల కంటే తగ్గితే నీటి సరఫరాకు ఇబ్బందులు ఎదురవుతాయి. గత మూడేళ్ల క్రితం వేసవిలో దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద నీరు భారీగా తగ్గి భారజల కర్మాగారం ఇన్ టేక్‌వెల్ వద్ద నీరు లేక కర్మాగారం షట్‌డౌన్ కావడంతో పాటు మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా నిలిచిపోయింది. ఈ ఏడాది ఇప్పటివరకైతే నీటి సరఫరాకు ఇబ్బంది లేదని మిషన్ భగీరథ అధికారులు చెబుతున్నారు.